



# కేజీహెచ్‌లో ఇష్టారాజ్యం



## అవసరం లేని పనులే అధికం

- కళ్లు మూసుకొని సీఎస్‌ఆర్ నిధుల వ్యయం
- చక్రం తిప్పుతున్న ఏపీఎంఎస్ఐడీసీ అధికారి
- ఈ మూడేళ్లలో రూ.30 కోట్ల ఖర్చు
- ఆర్చి నిర్మాణానికి రూ.85 లక్షల వ్యయం!
- ఏసీలు పూర్తిగా బిగించకుండానే బిల్లులు
- ఇప్పటికీ ఆస్పత్రికి చేరని రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన పరికరాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కింగ్ జార్జి ఆస్పత్రిలో అభివృద్ధి పనుల పేరిట భారీఎత్తున నిధుల దుర్వినియోగం జరుగుతోంది. నగరంలోని వివిధ పరిశ్రమలు సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద ఇచ్చే నిధులను కలెక్టర్ కార్యాలయం చేతికి ఎముక లేదన్నట్టు ఖర్చు చేస్తోంది. ఈ పనులన్నీ ఒకే ఒక ప్రభుత్వ సంస్థ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సప్లయ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ద్వారానే జరగడం గమనార్హం. అదే గోల్‌మాల్ కేంద్రంగా మారిపోయింది.



ఓపీ ఎదురుగా నిర్మిస్తున్న ఆర్చి

### రోగుల వసతుల పేరుతో దుర్వినియోగం

కేజీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ)కి కలెక్టర్ చైర్మన్. ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇదే పెద్ద ప్రభుత్వ ఆస్పత్రి కావడంతో రోజూ రెండు వేల మందికి వరకు వస్తుంటారు. ఇక్కడ ఏ పనిచేసినా సద్వినియోగం అవుతుందని కలెక్టర్ భావిస్తున్నారు. కానీ ఆ పేరుతో భారీగా నిధులు దుర్వినియోగం అయ్యాయి. ఏపీఎంఎస్ఐడీసీ, కాంట్రాక్టర్లు కూడబలుక్కొని నిధులు మింగేశారు. ఇటీవల కేజీహెచ్‌లో వందేళ్ల ఉత్సవాలు జరిగాయి. ఆ పేరుతో భారీగా ఖర్చు చేశారు. ఇన్‌గేట్ ఎదురుగా ప్రత్యేకంగా ఆర్చి నిర్మించారు. దానికే రూ.85 లక్షలు వెచ్చించారు. అందులో భారీగా డబ్బులు మిగలడంతో అలాంటి ఆర్చినే అవుట్ పేషెంట్ విభాగం ఎదురుగా నిర్మిస్తున్నారు.

### ఆ పరికరాలు ఏమయ్యాయో?

కలెక్టర్ మల్లికార్జున హెచ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక అన్ని విభాగాల నుంచి ఏమేం కావాలో రెండేళ్ల క్రితమే ఇండెంట్ తీసుకున్నారు. అన్ని విభాగాల అధిపతులు వారికి అవసరమైన పరికరాలు, ఫర్నీచర్ రాసిచ్చారు. వాటిని కలెక్టర్ ఏపీఎంఎస్ఐడీసీకి పంపారు. అక్కడి నుంచి వాటిని కొనుగోలు చేశారు. కానీ అవి రెండేళ్లయినా ఆయా విభాగాలకు చేరలేదు. దీనిపై హెచ్‌డీసీ సమావేశంలో విభాగాధిపతులు ఎన్నిసార్లు అడిగినా అదిగో వస్తున్నాయి... ఇదిగో వస్తున్నాయి అనే సమాధానం చెబుతున్నారు. ఇటీవల కొందరు నేరుగా చైర్మన్‌నే ప్రశ్నించారు. దాంతో ఆయన చేతులు ఎత్తేశారు. 'అవి ఎక్కడ ఆగిపోయాయో ఆ భగవంతుడికే ఎరుక' అంటూ వ్యాఖ్యానించారు. ఇవన్నీ కోట్ల రూపాయల విలువ చేసే పరికరాలు కావడం విశేషం. అందులో నాటి మంత్రి హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. పరికరాలను ప్రభుత్వ నిధులతో కొని వాటిని ఇక్కడ ఇవ్వలేదనేది ప్రధాన అంశం. ఇందులో ఏపీఎంఎస్ఐడీసీ అధికారి పాత్ర కూడా ఉందని అంటున్నారు.

### ఎన్నికల సమయంలో ఏసీల కొనుగోలు

ఇటీవల కేజీహెచ్‌లో వివిధ విభాగాల కోసం ఏసీలు కొనుగోలు చేశారు. అది ఎన్నికల సమయం. అటువంటప్పుడు ... మిగతా 6వ పేజీలో

# మహా కలవరం

వైసీపీ నేతల ప్రాజెక్టులపై కూటమి నేతల దృష్టి

- లొసుగులు ఉన్నా అనుమతులు ఇవ్వడంపై ఆరా
- ఆందోళనలో జీవీఎంసీ అధికారి
- పాత నిర్ణయాలు తవ్వుతారేమోనని ఆందోళన
- ఎన్నికల ముందు వరకూ వైసీపీ కార్యకర్త మాదిరిగా పనిచేశారని ఆరోపణలు


(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నేతలకు చెందిన ప్రాజెక్టులకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేసిన జీవీఎంసీ అధికారి ఒకరు ఇప్పుడు బిక్కుబిక్కుమంటున్నారు. ఆయా ప్రాజెక్టులకు ఏ విధంగా అనుమతులిచ్చారో తమకు వివరాలు తెలియజేయాల్సిందిగా తెలుగుదేశం, జనసేన నేతలు అడగడంతో సదరు అధికారి కలవరపడుతున్నారు. తన వద్దకు వచ్చే అధికారులకు ఇదే విషయం చెప్పుకుని మథనపడుతున్నారు.**

ఐదేళ్ల పాటు వైసీపీ నేతలు చెప్పిన పనులన్నింటినీ జీవీఎంసీ అధికారులు మంచి చెడు ఆలోచించకుండా చేసేశారు. ఈ క్రమంలోనే వైసీపీకి చెందిన ఒక ప్రజా ప్రతినిధితోపాటు మరొక నేత తమకు చెందిన భారీ ప్రాజెక్టులకు అనుమతుల కోసం గతంలో పనిచేసిన అధికారులను సంప్రతించగా...తిరస్కరించారు. సదరు నేతలకు చెందిన రెండు ప్రాజెక్టులకు సంబంధించి అనేక లొసుగులు, వివాదాలు ఉండడంతో అనుమతులు ఇచ్చేందుకు వెనకడుగు వేశారు. భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవనే భయంతో వాటికి ఆమోదం తెలపకుండా రిమార్కులు రాసి వెనక్కి పంపించేవాళ్లు. కానీ జీవీఎంసీలో ప్రస్తుతం ఉన్న అధికారి వచ్చీ రావడంతో రెండు, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతుల జారీపై ఆసక్తి చూపడం కింది అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన భూమి విషయంలో వివాదాలు ఉన్నాయని కిందిస్థాయి అధికారులు చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (జీవీఎంసీ న్యాయవాదులు) సలహా తీసుకున్నట్టు చూపించి అనుమతులు జారీచేసేశారు. సదరు కీలక అధికారి వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందనే ధీమా ప్రదర్శించడంతోపాటు అనుమతులు ఇచ్చినా వచ్చే ఇబ్బంది ఉండదనే అభిప్రాయాన్ని కిందిస్థాయి అధికారుల వద్ద వ్యక్తంచేసేవారు. అయితే ప్రజాభీష్టం సదరు అధికారి అభిప్రాయానికి భిన్నంగా ఉంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం పాలైంది. కూటమి రికార్డు స్థాయిలో సీట్లను గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నేతల ఆస్తులను లక్ష్యంగా చేసుకుని కూలగొట్టడంతో కూటమి నేతలు ఇప్పుడు వైసీపీ నేతల అక్రమ భవనాలు, ప్రాజెక్టులపై దృష్టిసారించారు. అందులో భాగంగా వైసీపీ ప్రజా ప్రతినిధిగా పనిచేసిన నేతతోపాటు కీలకంగా వ్యవహరించిన మరొక నేతకు చెందిన ప్రాజెక్టుల ... మిగతా 6వ పేజీలో

# ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

- మూడేళ్లుగా చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం
- ప్రభుత్వం మారడంతో ఈ ఏడాది నుంచి మళ్లీ పంపిణీ
- వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 22 వేల విద్యార్థులకు లబ్ధి



ఇంటర్ పుస్తకాలు

**మద్దిలపాలెం, జూన్ 20:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడానికి విద్యా శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ చర్యలు చేపట్టారు. వచ్చే నెల 15వ తేదీ నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీనివల్ల ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సుమారు 22 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడచిన మూడు విద్యా సంవత్సరాల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ నిలిపివేసింది. విద్యా వ్యవస్థలో విప్లవం తీసుకొస్తామన్న వైసీపీ పాలకులు కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించలేకపోయారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది 2008 నాటి 'పుస్తక ప్రసాదం' అనే పాత పథకాన్ని పునరిద్ధరించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కోరింది. ప్రభుత్వ కోర్కె మేరకు 2019-20 విద్యాసంవత్సరానికి టీటీడీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసింది. ఆ తర్వాత ఏడాది నుంచి పుస్తకాల పంపిణీ నిలిపివేసింది. దీంతో ... మిగతా 6వ పేజీలో

# టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు బుల్లెట్ ప్రూఫ్ వాహనం

**విశాఖపట్నం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ప్రభుత్వం బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయించింది. డ్రైవర్‌తోపాటు ఇద్దరు గన్‌మెన్‌ను ఇచ్చినట్టు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సొంత వాహనం ఉన్నప్పటికీ ప్రభుత్వం కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలోనే పర్యటించాలని పోలీసులు సూచించారు.



# ఏయూ రిజిస్ట్రార్‌కు జెల్ల

- సస్పెండ్ చేసిన చేతులతోనే పునర్నియామకం ఉత్తర్వు
- తిరిగి విధుల్లోకి అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్యదేవి

**విశాఖపట్నం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌కు జెల్ల తగిలింది. సస్పెండ్ చేసిన చేతులతోనే పునర్నియామకం ఉత్తర్వులు ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులైన పల్లా శ్రీనివాసరావు భార్య డాక్టర్ లావణ్య దేవి ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలో భర్తకు సహకారం అందించడానికి సెలవు పెట్టారు. ఆ సమయంలో పెదగంట్యాడలో పెంటమాంబ అమ్మవారి జాతర జరిగింది. దానికి భర్తతో కలిసి వెళ్లారు. అక్కడ ఎన్నికల ప్రచారం చేశారంటూ ఏయూ వీసీ ప్రసాదరెడ్డి బృందం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దాంతో ఆర్‌డీఓతో కలెక్టర్ (జిల్లా ఎన్నికల అధికారి) విచారణ చేయించారు. ఆ నివేదిక వీసీకి పంపించారు. ఈ నేపథ్యంలో లావణ్య దేవిని రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ సస్పెండ్ చేశారు. ఇది రాజకీయ కక్ష సాధింపు అని ఆనాడే విమర్శలు వచ్చాయి. వాటిని పట్టించుకునే అలవాటు లేని వీసీ, రిజిస్ట్రార్ లెక్క చేయలేదు. ఎన్నికల ఫలితాల తరువాత టీడీపీ అధికారంలోకి రావడంతో దీనిపై మరోసారి విచారణ చేశారు. కలెక్టర్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆదేశం మేరకు ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ, తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నామని అదే రిజిస్ట్రార్ స్టీఫెన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

భూముల విక్రయానికి విశాఖ ఉక్కు యత్నం ... మెయిన్‌లో

# టిడ్కోపై అయోమయం

వైసీపీ హయాంలో చేపట్టిన లబ్ధిదారుల ఎంపికపై అనుమానాలు

- పునఃపరిశీలన జరిపే అవకాశం ఉందంటున్న అధికారులు
- జీవీఎంసీ పరిధిలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- ఇప్పటివరకూ 7,456 మందికి ఇళ్ల అప్పగింత
- అరకొర సౌకర్యాలతో సగం మంది నివాసానికి విముఖం

| | |
|---|---|
| మొత్తం లేఅవుట్‌లు | 31 |
| నిర్మాణం ప్రారంభించిన ఇళ్లు | 24,192 |
| లబ్ధిదారులకు అప్పగించినవి | 7,456 |
| లబ్ధిదారులు ఉంటున్నవి | 4,000 |

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో టిడ్కో ఇళ్ల లబ్దిదారుల పరిస్థితి మళ్లీ అయోమయంలో పడింది. పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇంటి సదుపాయం కల్పించేందుకు 2016లో టీడీపీ ప్రభుత్వం టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్న ఈ పథకానికి 3,47,284 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించిన జీవీఎంసీ అధికారులు 2,03,438 మందిని అర్హులుగా గుర్తించారు.



బక్కన్నపాలెంలోని టిడ్కో గృహ సముదాయం

### 31 లేఅవుట్లలో నిర్మాణం

నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని 31 లేఅవుట్లలో 300, 365, 430 చదరపు అడుగుల వైశాల్యంలో ఫ్లాట్లను నిర్మించాలని నిర్ణయించారు. అర్హులు 300 చదరపు అడుగుల ఇంటికి రూ.25 వేలు, 365 చదరపు అడుగుల ఇంటికి రూ.50 వేలు, 430 చదరపు అడుగుల ఇంటికి రూ.లక్ష చొప్పున ముందుగా డీడీ ద్వారా చెల్లించాలని ప్రభుత్వం సూచించింది. అయితే 43,844 మంది మాత్రమే డీడీలు తీసి జీవీఎంసీ అధికారులకు అందజేశారు. ఈ పథకం కింద తొలి దశలో 55 వేల ఇళ్ల నిర్మాణానికి సంగివలస, బక్కన్నపాలెం, కొమ్మాది, దబ్బంద, అచ్చింనాయుడులోవ, ములగాడ, ట్రై జంక్షన్, దువ్వాడ, భానోజీతోట, అగనంపూడి, బర్మాకాలనీ, తలారివానిపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, కొండకొప్పాక, సిరసరపురం, సత్యనారాయణపురం, రాతిచెరువు, చినముషిడివాడ, చీమలాపల్లి, పరవాడ, అప్పికొండ, నడుపూరు, లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. వీటితోపాటు సుద్దగెడ్డ, ఆదర్శనగర్, చిలకపేట, సీహార్స్‌జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యాలమ్మకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, గౌరీనగర్, ఏఎస్‌ఆర్ నగర్ వంటి మురికివాడలను తొలగించి ఆ స్థలంలో 1,256 ఫ్లాట్లు చొప్పున మొత్తం 31 లేఅవుట్లలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 2019 నాటికి వీటిలో దాదాపు నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో ప్రభుత్వం అదే ఏడాది మార్చిలో లబ్ధిదారులకు లాటరీ ద్వారా ఇళ్లను కేటాయించేసింది.

### రద్దు చేసిన వైసీపీ

గత ఎన్నికల్లో వైసీపీ అధికారంలో రావడంతో ఇళ్ల కేటాయింపును రద్దు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, మళ్లీ సర్వే చేసింది. గతంలో డీడీలు తీసిన వారిలో 13,761 మందిని అనర్హులుగా తేల్చి 30,083 మందిని అర్హులుగా తేల్చింది. వీరందరికీ సరిపడా ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో లాటరీ ద్వారా 24,192 ఇళ్లను కేటాయించేసింది. మిగిలిన వారికి ... మిగతా 6వ పేజీలో

# మండిన నగరం

- ఉదయం నుంచే వేడి వాతావరణం
- ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- ఎయిర్‌పోర్టులో 39.4 డిగ్రీలు నమోదు



**విశాఖపట్నం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి):** పడమర గాలులతో గురువారం నగరం వేడెక్కింది. ఉదయం నుంచే మాడుపగిలే ఎండతో మండిపోయింది. దీనికితోడు ఉక్కపోత ఎక్కువ కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండ చుర్రుమనిపించింది. పది గంటల తరువాత వాతావరణం నిప్పుల కొలిమిలా మారింది. మధ్యాహ్నం 12 నుంచి మూడు గంటల వరకు ఎండ తీవ్రతకు నగరం ఉడికిపోయింది. ప్రజలు బయటకు రావడానికి వెనుకంజ వేశారు. మండు వేసవిలో మాదిరి వేడిగాలులు కొనసాగడంతో రాత్రి పది గంటలైనా వేడి తగ్గలేదు.

గడచిన కొద్దిరోజులుగా నగరం, పరిసరాల్లో ఎండలు, వేడిగాలులు కొనసాగుతున్నాయి. రుతుపవనాలు వచ్చి పదిరోజులైనా చల్లని గాలులు జాడలేదు. పడమర గాలులు కొనసాగడంతో సముద్ర తీర ప్రాంతంలో కూడా వేడి వాతావరణం నెలకొంటోంది. గురువారం ఎయిర్‌పోర్టులో 39.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే ఐదు డిగ్రీలు ఎక్కువ. గరిష్ఠ ఉష్ణోగ్రతలే కాకుండా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. పగలే కాకుండా రాత్రిపూట వాతావరణం కూడా వేడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా రాత్రింబవళ్లు ఏసీలు వినియోగం, నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడం, కాలుష్యం పెరుగుదల వల్ల జూన్‌లో వర్షాలు బదులు ఎండలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం వాతావరణ అనిశ్చితితో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి తప్ప రుతుపవనాల ప్రభావంతో కాదని పేర్కొన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి వర్షాలు పెరిగేంత వరకు ఎండలు కొనసాగుతాయన్నారు. ఈలోగా ఏమైనా రుతుపవనాలు బలపడితే వాతావరణం చల్లబడుతుందని వివరించారు..



నగర పరిధిలో ఎండాడ సర్వే నంబర్ 175/4లో ప్యాలెస్ మాదిరిగా నిర్మించిన వైసీపీ కార్యాలయం

# ప్యాలెస్ కాదు... వైసీపీ కార్యాలయం..!

- విశాఖ నేతల బరితెగింపు
- ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- ఎకరా రూ.50 కోట్ల విలువైన భూమికి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున చెల్లింపు
- 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తూ ఉత్తర్వులు
- దీనిపై అప్పట్లోనే వెల్లువెత్తిన విమర్శలు
- అధికార పార్టీ కావడంతో నోరెత్తని అధికారులు
- జీవీఎంసీ అనుమతి లేకుండానే భవన నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో యంత్రాంగంలోనూ, నేతల్లోనూ ఆందోళన
- తాజాగా ప్లాన్ అనుమతికి దరఖాస్తు

- వార్త II పేజీలో

# వ్యర్థాలతో నిండిన గెడ్డలు...అవస్థల్లో స్థానికులు

- గ్రేటర్ 26, 46 వార్డుల్లో పరిస్థితి
- తొలగింపు చర్యలు చేపట్టని సిబ్బంది
- దుర్గంధంతో అల్లాడుతున్న వార్డు వాసులు
- వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన

**అక్కయ్యపాలెం, జూన్ 20:** గ్రేటర్ 26, 46 వార్డుల్లోని పలు ప్రాంతాల్లోని గెడ్డల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో గెడ్డల్లో నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. శంకువానిపాలెం, సంజీవయ్య కాలనీల్లోని గెడ్డలు మరీ అధ్వానస్థితిలో దర్శనమిస్తున్నాయి. మురుగునీటి నిల్వతో దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చెత్త కారణంగా డెంగ్యూ, మలేరియా జ్వరాలతో పాటు ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు, సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పిస్తున్నా చెత్తను ఇష్టానుసారం గెడ్డల్లో వేస్తుండడం తోనే పరిస్థితి దారుణంగా మారుతోందంటున్నారు. పారిశుధ్య సిబ్బంది గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రంచేసి, చెత్తను తొలగించాల్సి ఉన్నా, వారు కంటితుడుపు చర్యలు చేపడుతున్నారనే విమర్శలు న్నాయి. స్వచ్ఛభారత్ పేరుతో ప్రధాన రహదారులను శుభ్రంచేస్తూ.. గెడ్డలను పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు స్పందించి శంకువానిపాలెం, సంజీవయ్య కాలనీలోని గెడ్డల్లో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సంజీవయ్య కాలనీలోని గెడ్డ వద్ద పరిస్థితి


శంకువానిపాలెం ప్రధాన గెడ్డలో పేరుకుపోయిన చెత్త

## వైద్య శిబిరానికి స్పందన

**అక్కయ్యపాలెం, జూన్ 20:** రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం మ్యాక్సీ విజన్ ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరీక్షలు చేసుకున్న వారికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శేషగిరిరావు, సునీత, రుషిక, వెంకట్ పాల్గొన్నారు.

## 23న ఘంటసాల ఆరాధనోత్సవాలు

**అక్కయ్యపాలెం, జూన్ 20:** ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల ఆరాధనోత్సవాలు ఈ నెల 23న పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నారు. ఉదయం 9-30 గంటలకు ప్రారంభమయ్యే ఆరాధనోత్సవాలకు అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

**జగదాంబ కూడలి, జూన్ 20:** వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేక సేవలను నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నిర్వహించిన సేవల్లో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేసి, పసుపు,కుంకుమలతో అలంకరించారు. ఉభయదాతలతకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి దర్శనాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

## రైతులకు న్యాయం చేయాలని వినతి

**మహారాణిపేట, జూన్20:** భూములు కోల్పోయిన రైతులకు ఇస్తామన్న హుద్‌హుద్ ఇళ్లను ఇప్పించి న్యాయం చేయాలని కొమ్మాది రెవళ్లపాలెం, బక్కన్నపాలేనికి రైతులు కలెక్టర్‌ను కోరారు. సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కు వినతిపత్రాన్ని అందించారు సర్వే నంబరు 96 నుంచి 101లో సుమారు 86 ఎకరాలు భూములను ప్రభుత్వం వివిధ నిర్మాణాల నిమిత్తం తీసుకుందని, నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న హుద్‌హుద్ ఇళ్లను బాధిత రైతులకు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు కేటాయించాలని కోరారు.

## 'ప్రజలు పట్టుదలతో కూటమిని గెలిపించారు'

**మహారాణిపేట, జూన్ 20:** రాష్ట్ర ప్రజలంతా పట్టుదలతో కూటమిని గెలిపించారని టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చరమ గీతం పాడారని, జగన్ కనీసం ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడని ప్రజలు నిర్ణయించారన్నారు. చిత్తుగా ఓడిపోయినా బలుపుతగ్గని వైసీపీ మూకలు పలుచోట్ల టీడీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని, మాజీ మంత్రి కొడాలి నాని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. రుషికొండ మీద ప్రజాధనంతో జగన్ కోసం భవనం నిర్మించిన అధికారులంతా జైలు పాలవడం ఖాయమన్నారు. సమావేశంలో గనగళ్ళ సత్యవతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు అమర్చుకోవాలి: సీఐ

**సీతంపేట, జూన్ 20:** అపార్టుమెంట్లు, వీధుల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సీఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దొండపర్తి రామాలయం వద్ద చోరీల నియంత్రణపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలను అడ్డుకునేందుకు బ్యాంక్ డెబిట్ కార్డు నంబర్లు, పాస్‌వర్డ్ ఇవ్వద్దని, బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మవద్దని, పిల్లలు మత్తు పదార్థాలకు, గంజాయికి అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

## పల్లాకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు

**కంచరపాలెం, జూన్ 20:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును 46, 55వార్డుల టీడీపీ నేతలు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. జోగా మహేష్ ఆధ్వర్యంలో బింగిరాజు రెడ్డి ,జోగా వెంకటరాజు, నరసింగరావు, దయాల ఈశ్వరరావు, జె.కృష్ణ, వాసు, సూరిబాబు అభినందించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పల్లాకు చిత్రపటాన్ని బహూకరించారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న 46,55 వార్డుల టీడీపీ నాయకులు

## నేటి నుంచి గురువుల ఆరాధనోత్సవాలు

**అక్కయ్యపాలెం, జూన్ 20:** శ్రీలలితా పీఠంలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు గురువుల ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి తెలిపారు. పీఠంలో గురువారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతి ఉపన్యాసాలు ఉంటాయన్నారు. 24న సిద్ధేశ్వరానంద భారతి జగద్గురు శంకర విజయం అనుగ్రహభాషణ, 25న లలితా సహస్రనామపారాయణ సువాసినీ పూజ, 26న భక్తనత్కీర నాటకం , 27న కవితా గోష్ఠి, 28న డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ నిర్వహణలో హైదరాబాద్‌కు చెందిన కవులతో సాహితీ రూపకం, భువన విజయం నాటకం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి, రమ్యానంద భారతి, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతి

## ఇందిరాగాంధీ స్టేడియం పనులు పరిశీలించిన కార్పొరేటర్

**పూర్ణామార్కెట్, జూన్ 20:** వన్‌టౌన్ పరిధిలోని ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధి పనులను 39వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ గురువారం పరిశీలించారు. వైసీసీ ఎమ్మెల్యే వాసుపల్లి స్టేడియం అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పదేళ్లలో స్టేడియం అభివృద్ధిపై శ్రద్ధ చూపకపోవడం వల్లే నిర్వీర్యంగా మారిందని దుయ్యబట్టారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలసి తాను పోరాటం చేయడంతోనే జీవీఎంసీ కమిషనర్ స్పందించి రూ.6 కోట్లను కేటాయించారన్నారు. స్టేడియం ఆధునికీకరణ, క్రీడా, జిమ్ పరికరాలు అందుబాటులోకి వస్తే ఎంతోమందికి మేలు జరుగుతుందన్నారు. యువత క్రీడల్లో నేపుణ్యం సాధించేలా క్రీడా మైదానం అందుబాటులోకి వస్తుందన్నారు. నగరంలోని విద్యార్థులు, క్రీడాకారులకు స్టేడియంను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, టీడీపీ శ్రేణులు, యువకులు పాల్గొన్నారు.


స్టేడియంలో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారులు

## మత్స్యకార కుటుంబాన్ని ఆదుకోవాలి

**మహారాణిపేట, జూన్ 20:** చేపల వేటకు వెళ్లి సముద్రంలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన మత్స్యకారుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని జనసేన పార్టీ మత్స్యకార నాయకుడు చీకటి రమేష్ కోరారు దమ్ము పోలరాజు (23) సముద్రంలో వేటకు వెళ్లి జెట్టీలో ఉండగా పిడుగు పడి మృతి చెందాడు. దీంతో వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆ కుటుంబానికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారి ఆశా జ్యోతికి వినతిపత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలో బర్రి కొండబాబు, మైలిపిల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు

**నర్సీపట్నం, జూన్ 20:** ఒకేషనల్ కళాశాల విద్యార్థిని పై ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ కాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకరపాలెం మండలానికి చెందిన ఓ వివాహిత నర్సీపట్నం డీఎంకే ఒకేషనల్ కళాశాలలో వెటర్నరీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురువారం మధ్యాహ్నం కళాశాల ప్రిన్సిపాల్ సోరీ ఉరఫ్ ముసలయ్య (35) ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సుధాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజయోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

**డాబాగార్డెన్స్, జూన్ 20:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యోగా శాంతికి చిహ్నమని, 140 దేశాల్లో 9,200 పైగా ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల్లో ఉచిత రాజ యోగ శిక్షణ అందిస్తున్నామన్నారు. నగరంలోని హెచ్‌బీకాలనీ, వన్‌టౌన్ బురుజుపేట, ఎంవీపీకాలనీ సెక్టార్ 1 నేతాజీపార్కు, మహారాణిపేట కలెక్టర్ ఆఫీస్ డౌన్, శాంతిపురం, రైల్వేన్యూకాలనీ వినాయక గుడి, గాజువాక బీసీ రోడ్డు, అగనంపూడి, మల్కాపురంలో ఈ శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. సమావేశంలో బీవీఎఫ్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, నాగరాజు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి, తదితరులు

# కేజీహెచ్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

జాగ్రత్తగా వ్యవహరించాలి. కానీ నిబంధనలు ఉల్లంఘించారు. హెచ్‌డీసీ ఛైర్మన్‌గా కలెక్టర్ హెచ్ఓడీలకు లక్ష రూపాయల వరకు ఖర్చు చేసుకునే అధికారం ఇచ్చారు. దానిని ఇక్కడ ఉపయోగించారు. ఒకేసారి 60 ఏసీలు కొంటే దానికి టెండర్లు పిలవాల్సి ఉంటుంది కాబట్టి అలా కాకుండా ఒక్కో విభాగం నుంచి రోజుకో ఏసీ చొప్పున ఇండెంట్ పెట్టించారు. అలా అందరి దగ్గర లేఖలు తీసుకొని, తెలిసిన కాంట్రాక్టర్ ద్వారా ఏపీఎంఎస్ఐడీసీ అధికారి ఏసీలు తెచ్చేశారు. వాటిలో కొన్నింటినే బిగించారు. మరికొన్ని బిగించాల్సి ఉంది. కానీ వాటికి సంబంధించిన బిల్లుపై ఇటీవల వివాదంపై వెళ్లిపోయిన సూపరింటెండెంట్‌తో సంతకం చేయించారని తెలిసింది. అనేక బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఏసీల బిల్లు పాస్ చేయడమే విశేషం.

**బ్యాటరీ కార్లలో అదే తీరు**

రోగుల కోసం ఐదు బ్యాటరీ కార్లను ఇటీవల కొనుగోలు చేశారు. ఒక్కొక్కటి రూ.5.5 లక్షలు. వాటి నిర్వహణ బాధ్యతను మెకానిక్‌కు కాకుండా మందులు సరఫరా చేసే మెడికల్ ఏజెన్సీకి అప్పగించారు. వాటికి ఏదైనా రిపేర్ వస్తే మెకానిక్ దానిని బాగు చేయాలి. మందులు సరఫరా చేసే ఏజెన్సీలో మెకానిక్‌లు ఉండరు. ఆ విషయం తెలిసినా సరే ఆ ఏజెన్సీకే నిర్వహణ కాంట్రాక్టు ఇచ్చారు. ఇలాంటివి చాలా కేజీహెచ్‌లో జరుగుతున్నాయి. సీఎస్ఆర్ నిధులు ఈ మూడేళ్లలో రూ.30 కోట్లు ఖర్చు చేసి ఉంటారని అంచనా. అందులో రూ.10 కోట్లు మాత్రమే ఉపయోగపడేవి చేశారు.మిగిలినవిదుర్వినియోగమయ్యాయనే ఆరోపణలున్నాయి.

# ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

... 5వ పేజీ తరువాయి

గత మూడేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాఠ్య పుస్తకాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని కళాశాలల అధ్యాపకులు ఓల్డ్ స్టూడెంట్స్ వద్ద పుస్తకాలు సేకరించి పేద విద్యార్థులకు పంచిపెట్టారు. మరికొందరు తమ వద్ద పాఠ్య పుస్తకాలతో క్లాసులు చెప్పి, నోట్స్ రాయించి మేనేజ్ చేశారు.

**మంత్రి ఆదేశాలతో 22 వేల మందికి లబ్ధి...**

జూలై 15 నాటికి విద్యార్థులందరికీ పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించడంతో ఉమ్మడి జిల్లా వృత్తివిద్యాశాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 39 ప్రభుత్వ, ఎయిడెడ్, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం 11,654 మంది చదువుతున్నారు. ఇప్పటివరకూ ప్రథమ సంవత్సరంలో సుమారు 8,500 మంది విద్యార్థులు చేరారు. నెలాఖరులోగా మరో మూడు వేల మంది చేరే అవకాశం ఉంది. ఈ చేరికల ఆధారంగా ఆంగ్లం, తెలుగు మీడియం సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి సుమారు 22 వేల మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రింట్ చేయడానికి జాబితా రూపొందించి ఇంటర్ బోర్డుకు పంపించారు.

# టిడ్కోపై అయోమయం

... 5వ పేజీ తరువాయి

గతంలో తీసిన డీడీలను వెనక్కి ఇవ్వడంతో పాటు జగనన్న కాలనీల్లో ఒక సెంటు చొప్పున స్థలాన్ని అందజేసింది.

**మాటలకే పరిమితం**

అయితే అధికారం చేపట్టిన ఏడాదిలోనే టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని వైసీపీ నేతలు చేసిన ప్రకటన మాటలకే పరిమితమైపోయింది. ఐదేళ్ల పాలనలో కేవలం 7,456 మందికి మాత్రమే ఇళ్లను అప్పగించారు. వీటిలో నాలుగు వేల ఇళ్లు టీడీపీ హయాంలో నిర్మించినవే. అంతేకాకుండా ఆయా ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, నివాసయోగ్యంగా లేకపోవడంతో సగానికిపైగా లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసిన కొద్దిరోజులకే ఖాళీచేసి మరోచోటకు తరలిపోయారు. కేవలం నాలుగు వేల మంది మాత్రమే గత్యంతరం లేక అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు.

**కేటాయింపుపై ఆరోపణలు**

వైసీపీ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్ల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు నోరెత్తలేదని సమాచారం. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో ఇళ్ల కేటాయింపులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను తిరగదోడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. లబ్ధిదారుల జాబితాలో మార్పులు చోటుచేసుకుంటాయని భావిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు.

# మహా కలవరం

... 5వ పేజీ తరువాయి

గురించి ఆరా తీస్తున్నారు. ఆ రెండు ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడానికి అధికారులు వేటిని ఆధారంగా తీసుకున్నారు, అనుమతులు ఇచ్చినప్పుడు ఎలాంటి నిబంధనలు పాటించారనే వివరాలు తమకు ఇవ్వాల్సిందిగా నేరుగా ఆ అధికారినే అడిగినట్టు తెలిసింది. దీంతో కొద్దిరోజుల కిందటి వరకూ వైసీపీ కార్యకర్త మాదిరిగా పనిచేసిన ఆ అధికారిలో ఆందోళన మొదలైంది. కిందిస్థాయి అధికారులు వారించినప్పటికీ వినకుండా ఆ ప్రాజెక్టులకు అనుమతిచ్చేశానని, ఇప్పుడు ఎలాంటి ఫలితం అనుభవించాల్సివస్తుందోనని తనను కలిసి అధికారుల వద్ద వాపోతున్నారని జీవీఎంసీలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**అక్కయ్యపాలెం, జూన్ 20:** నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు, బీఎస్‌లేఅవుట్, ఈటర్స్ స్టాప్ రెస్టారెంట్, వినాయక ఆలయం, సింధూర గెస్ట్ హౌస్, కిన్నెర మెస్, ఎన్‌జీజీఓస్ కాలనీ, అబిద్‌నగర్, పద్మశ్రీ ఆస్పత్రి ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

**కంచరపాలెం పరిధిలో రేపు...**

**కంచరపాలెం:** కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బీకే.నాయుడు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రవీంద్ర నగర్, శ్రీనగర్, రైతుబజారు, రెడ్డికంచరపాలెం, నలంద నగర్, ఐటీఐ జంక్షన్, దుర్గానగర్, తుమ్మడిపాలెం, గోకుల్ నగర్, గౌరీనగర్, తోట వీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



రైతుబజారుకు ఏజెన్సీ రైతులు తీసుకువచ్చిన పనస

## రైతుబజారులో జోరుగా పనసకాయల విక్రయాలు

**ఏజెన్సీ ప్రాంతాల నుంచి దిగుమతి**

**గోపాలపట్నం, జూన్ 20:** పనసకాయల సీజన్ ప్రారంభం కావడంతో రైతుబజారులో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఉమ్మడి విశాఖలోని ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, పాడేరు, అనంతగిరికి చెందిన రైతులు పనసకాయలను పెద్ద మొత్తంలో నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పనసకాయలను కూరల్లో వినియోగిస్తుండడంతో కేటరింగ్ వర్తకులు కూడా వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో లభించే పండ్లు రుచిగా ఉండడంతో ప్రజలు జోరుగా కొనుగోలు చేస్తున్నారు. పనస దిగుబడి ఎక్కువగా ఉండటడతో విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయని వర్తకులు చెబుతున్నారు. కాగ పనసకాయలను తురిమి వాటి పొట్టుతో చేసే కూర ఎంతో రుచికరంగా ఉంటుంది కాబట్టి ప్రజలు వీటిని ఎక్కువగా కొంటున్నారు. అలాగే కేటరింగ్ నిర్వాహకులు పనసకాయలను కూరలు, బిరియానీల తయారీల కోసం కొనుగోలు చేస్తున్నారు.

### వైభవంగా దుర్గమాంబ జాతర



**అగనంపూడి, జూన్ 20:** జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఈ-మర్రిపాలెం, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతరను వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని శోభాయమానంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దుర్గమ్మను దర్శించుకున్నారు. మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులు ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను బాణసంచా కాల్పుల నడుమ పురవీధుల్లో ఊరేగించి, తిరిగి ఆలయం వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు దుల్ల సంజయ్, చెల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల్లో కళాజాత కార్యక్రమాలు

**వేపగుంట, జూన్ 20:** వేపగుంట, నాయుడుతోట పరిసర ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటీ బచావో-బేటీ పఢావో పేరిట చిన్నారులు, వారి తల్లిదండ్రులకు కళాజాత పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాల కారణంగా వాటిల్లే ఇబ్బందులు, పిల్లలను పాఠశాలలకు పంపడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కళాకారులు ప్రదర్శనలు ఇస్తున్నారు. సీడీపీవో నీలవేణి ఆదేశాల మేరకు నిర్వహించినట్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు.

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షునికి అభినందనలు

**అగనంపూడి, జూన్ 20:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును అగనంపూడికి చెందిన పలువురి నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. తెలుగు మహిళ 79వ వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ, తదితరులు పల్లాను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గొల్లవిల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దేశేంద్ర ఆధ్వర్యంలో పలువురు పల్లాను కలిసి అభినందనలు తెలిపారు.

### సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

### రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 60, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 28, క్యారెట్ 32, దొండకాయలు 38, బంగాళదుంపలు 31, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 160, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 66, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, క్యాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 500 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | -- 125 |
| ఫారం ధర | -- 145 |
| విత్ స్కిన్ | -- 260 |
| స్కిన్‌లెస్ | -- 270 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

# చినముషిడివాడలో రాజు చెరువుకు ఎసరు!

- ఆక్రమణలతో కుదించుకుపోతున్న వైనం
- వాటాల విషయంలో ఒక్కటైపోతున్న పార్టీల నాయకులు
- రెవెన్యూ అధికారులు నిర్మాణదారులకు నోటీసులిచ్చి రెండేళ్లవుతున్నా చర్యలు శూన్యం



రాజు చెరువును ఆక్రమించి చేపట్టిన పునాది, నిర్మాణాలు

**పెందుర్తి, జూన్ 20:** మండల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు పరాధీనం అవుతున్నాయి. అక్రమణదారులు చెరువులను సైతం కబ్జా చేసి స్థలాలుగా విక్రయిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. ఈ క్రమంలో చినముషిడివాడ సర్వే నంబర్-163లో ఉన్న రాజు చెరువు ఆక్రమణలతో కుదించుకుపోయింది. కబ్జాదారుల దెబ్బకు చెరువు రూపురేఖలే మారిపోయాయి. సుమారు 24.86 ఎకరాల విస్తర్ణంలో గల ఈ చెరువు 15 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి. చినముషిడివాడ నుంచి సుజాతనగర్ వరకు విస్తరించి నడిబొడ్డున ఉన్న ఈ చెరువు ప్రాంతం ఎంతో విలువైనది కావడంతో కబ్జాదారుల కన్ను దీనిపై పడింది. తిలా పాపం.. తలా పిడికెడు అన్న చందాన వాటాలు వేసుకుని మరీ చెరువును ఆక్రమించి విక్రయాలు జరిపారు. ఇటీవల ఓ స్థిరాస్తి వ్యాపారి సమీపంలోని జిరాయతీ స్థలాన్ని కొనుగోలు చేసి దానికి ఆనుకుని ఉన్న చెరువును ఆక్రమించి మరీ ఇళ్లు నిర్మించి అమ్మేశాడు. మరో రియల్ వ్యాపారి చెరువు స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరిపాడు. ఇలా విక్రయాలు జరిపిన స్థలాలు చేతులు మారడంతో ఎంచక్కా పక్కా నిర్మాణాలు జరిగాయి.

ఈ విధంగా చెరువును ఆక్రమించిన స్థలంలో సుమారు వందకు పైగా ఇళ్ల నిర్మాణాలు జరిగినట్టు రెవెన్యూ అధికారులు ఇటీవల జరిపిన సర్వేలో నిర్ధారించారు. మరి కొంతమంది తమ జిరాయితీ స్థలం సమీపంలో ఉన్న చెరువు స్థలాన్ని కూడా ఆక్రమించి ప్లాట్లుగా విభజించి తప్పుడు సర్వే నంబర్లు, పత్రాలు సృష్టించి లక్షల రూపాయలకు విక్రయించారు. రాజకీయాల్లో నువ్వా..నేనా.? అన్నట్టుగా ఉన్న పార్టీల నాయకులు ఆక్రమణల్లో మాత్రం నువ్వు, నేను ఒకటేనన్న రీతిలో చెరువును వాటాలు వేసుకుని మరీ ఎసరు పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. పలువురు రెవెన్యూ అధికారుల సహకారంతోనే కొంత కాలంగా చెరువులో ఆక్రమణల పర్వం కొనసాగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే చెరువును కొందరు ఆక్రమించి.. విక్రయాలు జరిపిన స్థలాల్లో ఆవాసాలు ఏర్పరుచుకున్న వారిలో కొంతమందికి పట్టాలు కూడా రావడంతో ఈ స్థలాలకు మరింత గిరాకీ పెరిగింది. దీంతో పేదల ముసుగులో కొంతమంది పెద్దలు చెరువు ఆక్రమణలకు పాల్పడుతున్నారని రెవెన్యూ అధికారుల విచారణలో తెలిసింది. ఇక్కడ 60 గజాల స్థలం రూ.మూడు లక్షల నుంచి ఆరు లక్షల వరకు విక్రయిస్తున్నట్టు తెలిసింది.

**నోటీసులు ఇచ్చి రెండేళ్లయినా చర్యలు శూన్యం**

నీటి వనరులను ఆక్రమించుకుని నిర్మించిన అక్రమ భవనాలను ఎందుకు తొలిగించకూడదో సమాధానం చెప్పాలంటూ గత ఏడాది రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేయడంతో చినముషిడివాడ, సప్తగిరినగర్, శ్రీనివాసనగర్, కార్మికనగర్, క్రాంతినగర్ మీదుగా సుజాతనగర్ ప్రాంతానికి విస్తరించిన ఈ చెరువు ఆక్రమణలు మరోసారి బహిర్గతమయ్యాయి. చెరువును ఆక్రమించి నిర్మించిన సుమారు 40 మంది నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఇలా నోటీసులు జారీ చేసి రెండేళ్లు అవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరికొన్ని ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. తాజాగా మిగిలిన మిగతా చెరువు స్థలాన్ని సైతం ఆక్రమించేందుకు కబ్జాదారులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి రూ.కోట్ల విలువ చేసే రాజు చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**రాజు చెరువు పరిరక్షణకు చర్యలు**

**- తహసీల్దార్ బంగార్రాజు**

చినముషిడివాడలోని రాజు చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. నీటి వనరులను ఆక్రమించుకుని నిర్మించిన చెరువు ఆక్రమణలపై దృష్టిసారిస్తాం. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

## ప్రత్యేక అవసరాల చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించాలి

**జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్**

**పెదగంట్యాడ, జూన్ 20:** ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులలోని ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. ఉద్యానవనాల పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం పెదగంట్యాడలోని భవిత కేంద్రం ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11 భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో మానసిక వికాసం, ప్రశాంతత కలిగించేందుకు వివిధ రకాల పూల మొక్కలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటుతున్నామన్నారు. విశాఖ గ్రీన్ క్లైమెట్ ఎన్జీవోల సంస్థ అధ్యక్షుడు జనపరెడ్డి వెంకటరత్నం ఈ మొక్కలను తమకు అందిస్తున్నారన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేఎస్ విశ్వనాథన్

జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మానసిక ఆనందంతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పెంపొందించేందుకు భవిత కేంద్రం నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు. సహిత విద్య సమన్వయ జిల్లా కో-ఆర్డినేటర్ బి.గీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీసీ బి.శ్రీనివాసరావు, జెడ్పీ సన్యాసినాయుడు, తహసీల్దార్ భాస్కరరావు, ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, ఏపీవో అప్పలనాయుడు, దివ్యాంగుల నెట్‌వర్క్ కన్వీనర్ జీలకర్ర రమణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లోని విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. తొలుత అక్షిత ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం భవిత కేంద్రానికి బహూకరించిన ట్రెడ్‌మిల్, స్టిమిలేటర్‌ను కేఎస్ విశ్వనాథన్ ప్రారంభించారు.

## మంత్రివర్గ సమావేశంలో ఉక్కు అంశంపై తీర్మానం చేయాలి

**పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు**

**కూర్మన్నపాలెం, జూన్ 20:** ఈ నెల 24న జరగనున్న రాష్ట్ర మొదటి మంత్రివర్గ సమావేశంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంశంపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,225వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా తీర్మానం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల పోస్టులను భర్తీ చేస్తున్నట్టే.. స్టీల్‌ప్లాంటులో మూడేళ్లుగా ఖాళీగా ఉన్న ఏడు వేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.




దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

## షీలానగర్‌లో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 51వ శాఖ ప్రారంభం

**అక్కిరెడ్డిపాలెం, జూన్ 20:** షీలానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 51వ శాఖను గురువారం మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో సహకార బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. 110వ వసంతంలోకి అడుగుపెడుతున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 51 శాఖలతో ప్రజలకు విశేష సేవలందిస్తూ సుమారు రూ.88 కోట్ల లాభాలతో నడుస్తుండడం అభినందనీయమన్నారు. బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ సహకార రంగంలో తమ బ్యాంకు ముందంజలో ఉందని పేర్కొన్నారు.



బ్యాంకు నూతన శాఖను ప్రారంభిస్తున్న మానం ఆంజనేయులు

ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, బ్యాంకు డైరెక్టర్లు ఏజె స్టాలిన్, జేవీ సత్యనారాయణమూర్తి, జి.జనార్దనరావు, రామచంద్రరాజు, రామకృష్ణ, కె.భవానీ, సీఈవో నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



జనకళ లేని ఎన్ఏడీ కూడలి

### ఠారెత్తిస్తున్న ఎండలు-హడలిపోతున్న ప్రజలు

**సింధియా, జూన్ 20:** గత కొద్ది రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదారు గంటల వరకు సూరీడు ప్రతాపం చూపిస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకే హడలిపోతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్, యారాడ, పరిసర ప్రాంతాల్లో భరించరాని ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అత్యవసరమైన పని ఉంటే తప్ప ప్రజలు బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. భానుడి తాపానికి వీధులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఉక్కపోతకు తాళలేక అందరూ ఫాన్లు, ఏసీలు వేసుకుని ఇళ్ల వద్దే గడుపుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. ఎండ తీవ్రతకు గురువారం పలు కూడళ్లతో పాటు వీధులు జన సంచారం లేక ఖాళీగా కనిపించాయి.

**ఎన్.ఎ.డి.జంక్షన్:** ఎండ తీవ్రతకు నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఎన్ఏడీ కూడలి వెలవెలబోతూ కనిపించింది. భానుడి తాపానికి భీతిల్లి అత్యధిక శాతం మంది ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకపోవడంతో ఎన్ఏడీ జంక్షన్‌లో వాహనదారులు, పాదచారులు అంతంతమాత్రంగానే దర్శనమిచ్చారు. ఎండ వేడిమి అధికంగా ఉండడంతో ఎన్ఏడీ పరిసరాల్లో వ్యాపారాలు కూడా అంతంత మాత్రంగా సాగుతున్నాయని పలువురు వర్తకులు వాపోతున్నారు.

### పోతిన సన్యాసిరావుకు నివాళి

**మల్కాపురం, జూన్ 20:** యారాడలోని పీఎస్ఆర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు జయంతిని గురువారం నిర్వహించారు. ఇక్కడి ఆయన విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతిన సన్యాశిరావు ఎమ్మెల్యేగా ఉన్న 1972లో యారాడలో ఆయన పేరిట పీఎస్ఆర్ కాలనీ ఏర్పడిందని, నాటి నుంచి ఆయన జ్ఞాపకార్థం పలు కార్యక్రమాలను చేపడుతున్నామని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో తొత్తరి శ్రీనివాసరావు (చిట్టి), బోరాడ రమణ, ఎస్.అప్పారావు, జి.సన్యాసిపాత్రుడు, బి.అప్పారావు, ఎస్.అప్పారావు, రామ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావును కలిసిన ఉక్కు కార్మిక, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

### 'ఉక్కు'కు సహకరించాలంటూ 'పల్లా'కు విజ్ఞప్తి

**ఉక్కుటౌన్‌షిప్, జూన్ 20:** స్టీల్‌ప్లాంటుకు సంపూర్ణ సహాయ సహకారాలను అందించవలసిందిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయనను పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి ఊపిరి పోసి ప్లాంటును నిలబెట్టారని, అలాగే ప్రభుత్వ రంగంలోనే ప్లాంట్ కొనసాగేలా చూడడంతో పాటు సొంత గనులు ఏర్పాటుకు, నిర్వాసితులకు ఉపాధి కల్పనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే తన ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పల్లా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయ్యే మల్లయ్య, రామ్మోహన్‌కుమార్, సువర్ణ రత్నం, అంబేడ్కర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

### గంగవరం రోడ్డులో వీధి లైట్లు వేయాలి

**పెదగంట్యాడ, జూన్ 20:** పెదగంట్యాడ బీసీ రోడ్డులోని మహాత్మాగాంధీ జంక్షన్ నుంచి గంగవరం వరకు ఉన్న రోడ్డులో 30 శాతం వీధి లైట్లు వెలగడం లేదు. ఇవి మరమ్మతులకు గురై నాలుగు నెలలు దాటినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. దీంతో రాత్రయ్యేసరికి ఈ మార్గమంతా చీకటిమయంగా మారడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటికి తోడు అనేక మలుపులతో ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. గంగవరం, పల్లిపాలెం, జాలరిపల్లిపాలెం నిర్వాసిత కాలనీవాసులు పెదగంట్యాడ, గాజువాక ప్రాంతాలకు, స్టీల్‌ప్లాంటుకు ఇదే రోడ్డు నుంచి ప్రజలు, కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో వారు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన లైట్ల స్థానంలో కొత్తవి వేయాలని కోరుతున్నారు.



ఎండ బారిన పడకుండా చలివేంద్రం పందిరి కింద నిల్చొన్న ప్రయాణికులు

### చలివేంద్రాల పందిర్లే ప్రయాణికుల షెల్టర్లు

**పాత గాజువాక, తదితర ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు**

**గాజువాక, జూన్ 20:** పారిశ్రామిక ప్రాంతంలో అత్యధిక శాతం బస్టాప్‌ల వద్ద షెల్టర్లు లేకపోవడంతో మండుటెండలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వారం రోజులుగా భానుడి తీవ్రత మరింత అధికంగా ఉండడంతో బస్సుల కోసం వేచివుండే ప్రజలు ఎండ తాపానికి తాళలేక సమీపంలో ఉన్న చిన్న చిన్న దుకాణాలు, చలివేంద్రాల కోసం వేసిన చిన్నచిన్న కొబ్బరి, తాటాకు పందిర్లలో నిల్చుంటున్నారు. మండుటెండ నుంచి రక్షణ పొందేందుకు చివరకు చలివేంద్రాల కోసం వేసిన పందిర్లే తమకు దిక్కయ్యాయని, బస్ షెల్టర్లు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత గాజువాక బస్టాప్ నుంచి రోజుకు వందలాది మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వారు వేచివుండేందుకు బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండొచ్చినా, వానొచ్చినా తమకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొత్త గాజువాక, చినగంట్యాడ, దయాళ్‌నగర్, సినిమా హాల్ జంక్షన్, బీసీ రోడ్డు, శ్రీనగర్ కూడళ్లలో నెలకొంది. పాత గాజువాకలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ట్రాఫిక్ పోలీసులు, ప్రయాణికులు కోరుతున్నప్పటికీ ఆర్టీసీ అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్ల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఓబీసీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు

**ఉక్కుటౌన్‌షిప్, జూన్ 20:** స్టీల్‌ప్లాంట్ కార్మికుల పిల్లలకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కోరుతూ తహీల్దార్‌కు స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కాలంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పిల్లలకు విద్య ఉపాధి నిమిత్తం ఓబీసీ ధ్రువపత్రాలు ఇచ్చే విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, వీటిని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్మికుల పిల్లలకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్టు నాయకులు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు బి.అప్పారావు, శ్రీనివాసరావు, సింహాచలం, నాయుడు, తదితరులు ఉన్నారు.

### శిలాఫలకాల ఏర్పాటుపై గణబాబుకు ఫిర్యాదు

**ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 20:** జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా కాలనీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనులకు సంబంధించి శిలాఫలకాల ఏర్పాటులో ప్రోటోకాల్‌ను పాటించ లేదంటూ టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎం.వాసు దేవరావు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు ఫిర్యాదు చేశారు. మర్రిపాలెం వుడా కాలనీలో రోడ్లు, కాలువలు, ఇతర పనులకు సంబంధించిన శిలాఫలకాలపై నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పేరు, ఫోటో లేకుండా వైసీపీ గుర్తు ఫ్యాన్, నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్, నాటి సీఎం జగన్, ఇతరుల ఫొటోలు ఉండడం సమంజసం కాదన్నారు. ఇలాంటి శిలాఫలకాలు వార్డులో సుమారు యాభై వరకు ఉన్నట్టు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా శిలాఫలకాల ఏర్పాటులో నింబంధనలు పాటించని జోన్-5 అధికారులపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### పైడితల్లమ్మ వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

**కూర్మన్నపాలెం, జూన్ 20:** జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాసనగర్, ఎర్రగెడ్డ కాలనీ ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లమ్మ షష్ఠి వార్షికోత్సవాన్ని జూలై ఒకటో తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అమ్మవారి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

### డ్రగ్స్ రహిత నగరంగా విశాఖ: ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

**ఆర్పీపేట (కంచరపాలెం), జూన్ 20:** డ్రగ్స్ రహిత నగరంగా విశాఖను మార్చడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 56వార్డు పరిధి కంచరపాలెం మెట్టు వద్దనున్న ముత్యమాంబ కాంప్లెక్స్‌లో గురువారం డ్రగ్స్ వినియోగం, అనర్థాలపై కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, ప్రజలకు పోలీసులు అవగాహక కల్పించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ వైసీపీ హయాంలో విశాఖతో పాటు రాష్ట్రం గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మారిందన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత జీవితం ఛిద్రమవుతుందన్నారు. డీసీపీ మేకా సత్తిబాబు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, పశ్చిమ ఏసీపీ నరసింహమూర్తి, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యర్థాలతో నిండిన గెడ్డలు...అవస్థల్లో స్థానికులు

- ›› గ్రేటర్ 26, 46 వార్డుల్లో పరిస్థితి
- ›› తొలగింపు చర్యలు చేపట్టని సిబ్బంది
- ›› దుర్గంధంతో అల్లాడుతున్న వార్డు వాసులు
- ›› వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన



సంజీవయ్య కాలనీలోని గెడ్డ వద్ద పరిస్థితి



శంకువానిపాలెం ప్రధాన గెడ్డలో పేరుకుపోయిన చెత్త

**అక్కయ్యపాలెం, జూన్ 20:** గ్రేటర్ 26, 46 వార్డుల్లోని పలు ప్రాంతాల్లోని గెడ్డల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో గెడ్డల్లో నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. శంకువానిపాలెం, సంజీవయ్య కాలనీల్లోని గెడ్డలు మరీ అధ్వానస్థితిలో దర్శనమిస్తున్నాయి. మురుగునీటి నిల్వతో దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చెత్త కారణంగా డెంగ్యూ, మలేరియా జ్వరాలతో పాటు ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు, సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పిస్తున్నా చెత్తను ఇష్టానుసారం గెడ్డల్లో వేస్తుండడం తోనే పరిస్థితి దారుణంగా మారుతోందంటున్నారు. పారిశుధ్య సిబ్బంది గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రంచేసి, చెత్తను తొలగించాల్సి ఉన్నా, వారు కంటితుడుపు చర్యలు చేపడుతున్నారనే విమర్శలు న్నాయి. స్వచ్ఛభారత్ పేరుతో ప్రధాన రహదారులను శుభ్రంచేస్తూ.. గెడ్డలను పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు స్పందించి శంకువానిపాలెం, సంజీవయ్య కాలనీలోని గెడ్డల్లో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**అక్కయ్యపాలెం, జూన్ 20:** నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు, బీఎస్‌లేఅవుట్, ఈటర్స్ స్టాప్ రెస్టారెంట్, వినాయక ఆలయం, సింధూర గెస్ట్ హౌస్, కిన్నెర మెస్, ఎన్‌జీజీఓస్ కాలనీ, అబిద్‌నగర్, పద్మశ్రీ ఆస్పత్రి ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

**కంచరపాలెం పరిధిలో రేపు...**

**కంచరపాలెం:** కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బీకే.నాయుడు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రవీంద్ర నగర్, శ్రీనగర్, రైతుబజారు, రెడ్డికంచరపాలెం, నలంద నగర్, ఐటీఐ జంక్షన్, దుర్గానగర్, తుమ్మడిపాలెం, గోకుల్ నగర్, గౌరీనగర్, తోట వీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వైద్య శిబిరానికి స్పందన

**అక్కయ్యపాలెం, జూన్ 20:** రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం మ్యాక్సీ విజన్ ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరీక్షలు చేసుకున్న వారికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శేషగిరిరావు, సునీత, రుషిక, వెంకట్ పాల్గొన్నారు.

## 23న ఘంటసాల ఆరాధనోత్సవాలు

**అక్కయ్యపాలెం, జూన్ 20:** ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల ఆరాధనోత్సవాలు ఈ నెల 23న పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నారు. ఉదయం 9-30 గంటలకు ప్రారంభమయ్యే ఆరాధనోత్సవాలకు అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

**జగదాంబ కూడలి, జూన్ 20:** వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేక సేవలను నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నిర్వహించిన సేవల్లో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేసి, పసుపు,కుంకుమలతో అలంకరించారు. ఉభయదాతలతకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి దర్శనాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

## రైతులకు న్యాయం చేయాలని వినతి

**మహారాణిపేట, జూన్20:** భూములు కోల్పోయిన రైతులకు ఇస్తామన్న హుద్‌హుద్ ఇళ్లను ఇప్పించి న్యాయం చేయాలని కొమ్మాది రెవళ్లపాలెం, బక్కన్నపాలేనికి రైతులు కలెక్టర్‌ను కోరారు. సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కు వినతిపత్రాన్ని అందించారు సర్వే నంబరు 96 నుంచి 101లో సుమారు 86 ఎకరాలు భూములను ప్రభుత్వం వివిధ నిర్మాణాల నిమిత్తం తీసుకుందని, నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న హుద్‌హుద్ ఇళ్లను బాధిత రైతులకు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు కేటాయించాలని కోరారు.

## 'ప్రజలు పట్టుదలతో కూటమిని గెలిపించారు'

**మహారాణిపేట, జూన్ 20:** రాష్ట్ర ప్రజలంతా పట్టుదలతో కూటమిని గెలిపించారని టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చరమ గీతం పాడారని, జగన్ కనీసం ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడని ప్రజలు నిర్ణయించారన్నారు. చిత్తుగా ఓడిపోయినా బలుపుతగ్గని వైసీపీ మూకలు పలుచోట్ల టీడీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని, మాజీ మంత్రి కొడాలి నాని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. రుషికొండ మీద ప్రజాధనంతో జగన్ కోసం భవనం నిర్మించిన అధికారులంతా జైలు పాలవడం ఖాయమన్నారు. సమావేశంలో గనగళ్ల సత్యవతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు అమర్చుకోవాలి: సీఐ

**సీతంపేట, జూన్ 20:** అపార్టుమెంట్లు, వీధుల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సీఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దొండపర్తి రామాలయం వద్ద చోరీల నియంత్రణపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలను అడ్డుకునేందుకు బ్యాంక్ డెబిట్ కార్డు నంబర్లు, పాస్‌వర్డ్ ఇవ్వద్దని, బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మవద్దని, పిల్లలు మత్తు పదార్థాలకు, గంజాయికి అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

## పల్లాకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న 46,55 వార్డుల టీడీపీ నాయకులు

**కంచరపాలెం, జూన్ 20:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును 46, 55వార్డుల టీడీపీ నేతలు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. జోగా మహేష్ ఆధ్వర్యంలో బింగిరాజు రెడ్డి ,జోగా వెంకటరాజు, నరసింగరావు, దయాల ఈశ్వరరావు, జె.కృష్ణ, వాసు, సూరిబాబు అభినందించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పల్లాకు చిత్రపటాన్ని బహూకరించారు.

## నేటి నుంచి గురువుల ఆరాధనోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతి

**అక్కయ్యపాలెం, జూన్ 20:** శ్రీలలితా పీఠంలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు గురువుల ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి తెలిపారు. పీఠంలో గురువారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతి ఉపన్యాసాలు ఉంటాయన్నారు. 24న సిద్ధేశ్వరానంద భారతి జగద్గురు శంకర విజయం అనుగ్రహభాషణ, 25న లలితా సహస్రనామపారాయణ సువాసినీ పూజ, 26న భక్తనత్కీర నాటకం , 27న కవితా గోష్ఠి, 28న డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ నిర్వహణలో హైదరాబాద్‌కు చెందిన కవులతో సాహితీ రూపకం, భువన విజయం నాటకం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి, రమ్యానంద భారతి, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ స్టేడియం పనులు పరిశీలించిన కార్పొరేటర్



స్టేడియంలో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారులు

**పూర్ణామార్కెట్, జూన్ 20:** వన్‌టౌన్ పరిధిలోని ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధి పనులను 39వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ గురువారం పరిశీలించారు. వైసీపీ ఎమ్మెల్యే వాసుపల్లి స్టేడియం అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పదేళ్లలో స్టేడియం అభివృద్ధిపై శ్రద్ధ చూపకపోవడం వల్లే నిర్వీర్యంగా మారిందని దుయ్యబట్టారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలసి తాను పోరాటం చేయడంతోనే జీవీఎంసీ కమిషనర్ స్పందించి రూ.6 కోట్లను కేటాయించారన్నారు. స్టేడియం ఆధునికీకరణ, క్రీడా, జిమ్ పరికరాలు అందుబాటులోకి వస్తే ఎంతోమందికి మేలు జరుగుతుందన్నారు. యువత క్రీడల్లో నేపుణ్యం సాధించేలా క్రీడా మైదానం అందుబాటులోకి వస్తుందన్నారు. నగరంలోని విద్యార్థులు, క్రీడాకారులకు స్టేడియంను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, టీడీపీ శ్రేణులు, యువకులు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబాన్ని ఆదుకోవాలి

**మహారాణిపేట, జూన్ 20:** చేపల వేటకు వెళ్లి సముద్రంలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన మత్స్యకారుడి కుటుంబానికి నష్టపరి హారం చెల్లించి ఆదుకోవాలని జనసేన పార్టీ మత్స్యకార నాయకుడు చీకటి రమేష్ కోరారు దమ్ము పోలరాజు (23) సముద్రంలో వేటకు వెళ్లి జెట్టీలో ఉండగా పిడుగు పడి మృతి చెందాడు. దీంతో వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆ కుటుంబానికి నష్ట పరిహారం అదేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారి ఆశా జ్యోతికి వినతిపత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలో బర్రి కొండబాబు, మైలిపిల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు

**నర్సీపట్నం, జూన్ 20:** ఒకేషనల్ కళాశాల విద్యార్థిని పై ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ కాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకరపాలెం మండలానికి చెందిన ఓ వివాహిత నర్సీపట్నం డీఎంకే ఒకేషనల్ కళాశాలలో వెటర్నరీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురువారం మధ్యాహ్నం కళాశాల ప్రిన్సిపాల్ సోరీ ఉరఫ్ ముసలయ్య (35) ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సుధాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజయోగతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి, తదితరులు

**డాబాగార్డెన్స్, జూన్ 20:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యోగా శాంతికి చిహ్నమని, 140 దేశాల్లో 9,200 పైగా ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల్లో ఉచిత రాజ యోగ శిక్షణ అందిస్తున్నామన్నారు. నగరంలోని హెచ్‌బీకాలనీ, వన్‌టౌన్ బురుజుపేట, ఎంవీపీకాలనీ సెక్టార్ 1 నేతాజీపార్కు, మహారాణిపేట కలెక్టర్ ఆఫీస్ డౌన్, శాంతిపురం, రైల్వేన్యూకాలనీ వినాయక గుడి, గాజువాక బీసీ రోడ్డు, అగనంపూడి, మల్కాపురంలో ఈ శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. సమావేశంలో బీజేఎఫ్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, నాగరాజు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీహెచ్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

జాగ్రత్తగా వ్యవహరించాలి. కానీ నిబంధనలు ఉల్లంఘించారు. హెచ్‌డీసీ చైర్మన్‌గా కలెక్టర్ హెచ్‌ఓడీలకు లక్ష రూపాయల వరకు ఖర్చు చేసుకునే అధికారం ఇచ్చారు. దానిని ఇక్కడ ఉపయోగించారు. ఒకేసారి 60 ఏసీలు కొంటే దానికి టెండర్లు పిలవాల్సి ఉంటుంది కాబట్టి అలా కాకుండా ఒక్కో విభాగం నుంచి రోజుకో ఏసీ చొప్పున ఇండెంట్ పెట్టించారు. అలా అందరి దగ్గర లేఖలు తీసుకొని, తెలిసిన కాంట్రాక్టర్ ద్వారా ఏపీఎంఎస్ఐడీసీ అధికారి ఏసీలు తెచ్చేశారు. వాటిలో కొన్నింటినే బిగించారు. మరికొన్ని బిగించాల్సి ఉంది. కానీ వాటికి సంబంధించిన బిల్లుపై ఇటీవల వివాదంపై వెళ్లిపోయిన సూపరింటెండెంట్‌తో సంతకం చేయించారని తెలిసింది. అనేక బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఏసీల బిల్లు పాస్ చేయడమే విశేషం.

**బ్యాటరీ కార్లలో అదే తీరు**

రోగుల కోసం ఐదు బ్యాటరీ కార్లను ఇటీవల కొనుగోలు చేశారు. ఒక్కొక్కటి రూ.5.5 లక్షలు. వాటి నిర్వహణ బాధ్యతను మెకానిక్‌కు కాకుండా మందులు సరఫరా చేసే మెడికల్ ఏజెన్సీకి అప్పగించారు. వాటికి ఏదైనా రిపేర్ వస్తే మెకానిక్ దానిని బాగు చేయాలి. మందులు సరఫరా చేసే ఏజెన్సీలో మెకానిక్‌లు ఉండరు. ఆ విషయం తెలిసినా సరే ఆ ఏజెన్సీకే నిర్వహణ కాంట్రాక్టు ఇచ్చారు. ఇలాంటివి చాలా కేజీహెచ్‌లో జరుగుతున్నాయి. సీఎస్ఆర్ నిధులు ఈ మూడేళ్లలో రూ.30 కోట్లు ఖర్చు చేసి ఉంటారని అంచనా. అందులో రూ.10 కోట్లు మాత్రమే ఉపయోగపడేవి చేశారు.మిగిలినవిదుర్వినియోగమయ్యాయనే ఆరోపణలున్నాయి.

## ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

... 5వ పేజీ తరువాయి

గత మూడేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాఠ్య పుస్తకాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని కళాశాలల అధ్యాపకులు ఓల్డ్ స్టూడెంట్స్ వద్ద పుస్తకాలు సేకరించి పేద విద్యార్థులకు పంచిపెట్టారు. మరికొందరు తమ వద్ద పాఠ్య పుస్తకాలతో క్లాసులు చెప్పి, నోట్స్ రాయించి మేనేజ్ చేశారు.

**మంత్రి ఆదేశాలతో 22 వేల మందికి లబ్ధి...**

జూలై 15 నాటికి విద్యార్థులందరికీ పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించడంతో ఉమ్మడి జిల్లా వృత్తివిద్యాశాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 39 ప్రభుత్వ, ఎయిడెడ్, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం 11,654 మంది చదువుతున్నారు. ఇప్పటివరకూ ప్రథమ సంవత్సరంలో సుమారు 8,500 మంది విద్యార్థులు చేరారు. నెలాఖరులోగా మరో మూడు వేల మంది చేరే అవకాశం ఉంది. ఈ చేరికల ఆధారంగా ఆంగ్లం, తెలుగు మీడియం సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి సుమారు 22 వేల మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రింట్ చేయడానికి జాబితా రూపొందించి ఇంటర్ బోర్డుకు పంపించారు.

## టిడ్కోపై అయోమయం

... 5వ పేజీ తరువాయి

గతంలో తీసిన డీడీలను వెనక్కి ఇవ్వడంతో పాటు జగనన్న కాలనీల్లో ఒక సెంటు చొప్పున స్థలాన్ని అందజేసింది.

**మాటలకే పరిమితం**

అయితే అధికారం చేపట్టిన ఏడాదిలోనే టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని వైసీపీ నేతలు చేసిన ప్రకటన మాటలకే పరిమితమైపోయింది. ఐదేళ్ల పాలనలో కేవలం 7,456 మందికి మాత్రమే ఇళ్లను అప్పగించారు. వీటిలో నాలుగు వేల ఇళ్లు టీడీపీ హయాంలో నిర్మించినవే. అంతేకాకుండా ఆయా ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, నివాసయోగ్యంగా లేకపోవడంతో సగానికిపైగా లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసిన కొద్దిరోజులకే ఖాళీచేసి మరోచోటకు తరలిపోయారు. కేవలం నాలుగు వేల మంది మాత్రమే గత్యంతరం లేక అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు.

**కేటాయింపుపై ఆరోపణలు**

వైసీపీ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్ల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు నోరెత్తలేదని సమాచారం. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో ఇళ్ల కేటాయింపులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను తిరగదోడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. లబ్ధిదారుల జాబితాలో మార్పులు చోటుచేసుకుంటాయని భావిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు.

## మహా కలవరం

... 5వ పేజీ తరువాయి

గురించి ఆరా తీస్తున్నారు. ఆ రెండు ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడానికి అధికారులు వేటిని ఆధారంగా తీసుకున్నారు, అనుమతులు ఇచ్చినప్పుడు ఎలాంటి నిబంధనలు పాటించారనే వివరాలు తమకు ఇవ్వాల్సిందిగా నేరుగా ఆ అధికారినే అడిగినట్టు తెలిసింది. దీంతో కొద్దిరోజుల కిందటి వరకూ వైసీపీ కార్యకర్త మాదిరిగా పనిచేసిన ఆ అధికారిలో ఆందోళన మొదలైంది. కిందిస్థాయి అధికారులు వారించినప్పటికీ వినకుండా ఆ ప్రాజెక్టులకు అనుమతిచ్చేశానని, ఇప్పుడు ఎలాంటి ఫలితం అనుభవించాల్సివస్తుందోనని తనను కలిసి అధికారుల వద్ద వాపోతున్నారని జీవీఎంసీలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మధురవాడ/కొమ్మాది, జూన్ 20 :** మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నగరంపాలెం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్‌నగర్, పోర్టు కాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్ కాలనీ, డాక్ యార్డు కాలనీ, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయకాలనీ, మల్లయ్యపాలెం, నగరంపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. అలాగే పీఎంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని బక్కన్నపాలెం, సిద్దార్థనగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా సిద్దార్థనగర్, సౌండ్ అండ్ సౌండ్ లేఅవుట్, ఎఫ్‌సీఎల్ లేఅవుట్, ఎస్‌బీఐ లేఅవుట్, దుర్గమ్మ టెంపుల్, పీఎంపాలెం ఆఖరి బస్టాప్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా ఉండదని ఏఈ అప్పలనాయుడు తెలిపారు.

### ఆరిలోవ పరిధిలో...

**ఆరిలోవ :** ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆరిలోవ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, బాలాజీ నగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్, మస్తాఫానగర్, అన్నానగర్, కైలాసనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

### జేఆర్‌నగర్‌లో...

**వెంకోజీపాలెం :** జేఆర్‌నగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలంనాయుడు తెలిపారు. జేఆర్‌నగర్, వెంకోజీపాలెం, ఇసుకతోట, లాసన్స్ ప్రాంతం, ఇసుకతోట సిగ్నల్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

## నేడు యోగా ఫొటో ఎగ్జిబిషన్

**వెంకోజీపాలెం, జూన్ 20 :** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఉన్న యోగా విలేజ్ వద్ద శుక్రవారం ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఐదు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని సీబీసీ ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి తెలిపారు. దీన్ని ఎంపీ శ్రీభరత్ ప్రారంభిస్తారని, నగరవాసులు పెద్ద సంఖ్యలో తిలకించి యోగా విశిష్టతను తెలుసుకోవాలన్నారు.

## యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

**భీమునిపట్నం :** పట్టణంలోని కృష్ణా కాలనీలో వున్న యోగ చైతన్య సంస్థలో శుక్రవారం యోగా దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. సంస్థ నిర్వాహకుడు సీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5.30 నుంచి 6.30 వరకు యోగాసనాలు జరగనున్నాయి.

## 'ఆలయ పూజారిపై దాడి అమానుషం'

**ఆరిలోవ,జూన్ 20 :** ఏలూరు జిల్లా పోలవరం మండలంలో చేతబడి చేస్తున్నాడని ఆలయ పూజారిపై స్థానికులు దాడి చేయడం అమానుషమని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు జె. రవి, టి. కృష్ణమూర్తి అన్నారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో పూజారి చేతబడి చేస్తున్నాడని, ఆయనపై విచక్షణారహితంగా దాడి చేయడం క్షమించరాని నేరం అన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## 12వ వార్డులో అన్నదానం

**ఆరిలోవ, జూన్ 20 :** జీవీఎంసీ 12వ వార్డులోని లీలా సుందరయ్య నగర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయం 14వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ప్రారంభించారు. అంతకముందు ఎమ్మెల్యే ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, 12వ వార్డు కార్యదర్శి గాడి సత్యం, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, ఆలయ కమిటీ సభ్యులు పూడి శ్రీను, కర్రి కృష్ణ, బండారు శంకరరావు, మరదాన గోపీ, అవతారం పాల్గొన్నారు.

# ఆరు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా
- బక్కన్నపాలెంలో ఇళ్లు పరిశీలన



లబ్ధిదారులతో కలిసి టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న గంటా శ్రీనివాసరావు

**కొమ్మాది, జూన్ 20 :** టిడ్కో ఇళ్లను ఆరు నెలల్లో లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గురువారం ఆయన లబ్ధిదారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బక్కన్నపాలెంలో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లు పరిశీలించారు.అప్పటి ప్రభుత్వం ఇక్కడ ఆరు ఎకరాల్లో ఎనిమిది బ్లాకుల్లో 380 ఇళ్లు నిర్మించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎన్నో బాధలు అనుభవించిన ప్రజలు రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని భావించి, చారిత్రక తీర్పు ఇచ్చారన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం అత్యాధునికమైన షేర్ వాల్ టెక్నాలజీతో భూకంపాలను కూడా తట్టుకునేలా టిడ్కో ఇళ్లు నిర్మించిందని, పనులు చివరి దశలో ఉన్న సమయంలో 2019 ఎన్నికల్లో తాము అధికారం కోల్పోవడంతో వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. వారి నిర్లక్ష్యానికి వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టిపోయాయని విమర్శించారు. టీడీపీకి మంచి పేరు రాకూడదని పోలవరం, అమరావతి, టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యంగా వదిలేశారని చెప్పారు. లబ్ధిదారులు ప్రస్తుతం ఇళ్ల లోపలికి వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల్లో ఇళ్లను శుభ్రం చేసి, లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. అలాగే హుద్‌హుద్ తుఫాన్ బాధితులకు 2018లో తెలుగు సినీ పరిశ్రమ నిర్మించిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, చిక్కాల విజయ్‌బాబు, జోన్-2 కమిషనర్ శైలజావాణి, ఈఈ శాంతిరాజు, టిడ్కో ఎస్‌ఈ నరసింహమూర్తి, ఈఈ సుధాకర్, పీఓ లక్ష్మి, స్థానిక నాయకులు జీవన్‌కుమార్, దాసరి శ్రీనివాస్, గరె గురునాథ్, గొల్లంగి ఆనందబాబు, గొలగాని సన్యాసిరావు,పోతిన శివ, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు ,పోతిన రఘు, వాండ్రాసి అప్పలనాయుడు, లొడగల జానకీరామ్ పాల్గొన్నారు.

### గంటాకు అభినందనలు

**భీమునిపట్నం :** జీవీఎంసీ 4వ వార్డు టీడీపీ సీనియర్ నాయకుడు, భీమిలి ఏఎంసీ మాజీ డైరెక్టర్ శీరపు రమణ, నియోజకవర్గ తెలుగుయువత నాయకుడు పాసి త్రినాథ్ కుమార్ నగరంలోని ఎమ్మెల్యే గంటా నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని గంటాను కోరారు. వారితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

# మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

**సదస్సులో పోలీస్ ఉన్నతాధికారులు**



సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

**ఎంవీపీ కాలనీ, జూన్ 20 :** యువత మాదక ద్రవ్యాలకు బానిస అయితే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఏసీపీ రాంబాబు అన్నారు. గురువారం ఆయన ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సెల్ ఫోన్లలోని పలు సైట్లు ద్వారా యువత మోసగాళ్ల బారిన పడుతున్నారన్నారు. మోసపోయినట్టు తెలిసిన వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీపీ సీఐ సంజీవరావు, కళాశాల డైరెక్టర్ గిరిధర్, అధ్యాపకుడు శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

**సింహాచలం :** మాదక ద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో పౌరులంతా భాగస్వాములు కావాలని నగర డీసీపీ సత్తిబాబు పిలుపునిచ్చారు. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అధ్యక్షతన 98వ వార్డు కె. కన్వెన్షన్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువతను లక్ష్యంగా చేసుకుని మాదక ద్రవ్యాల వ్యాప్తి జరుగుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోం మంత్రి అనిత ఆశయం మేరకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను అమలు చేసి మాదక ద్రవ్యాల నియంత్రణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి, కంచరపాలెం, గోపాలపట్నం, ఎయిర్ పోర్టు పోలీసు స్టేషన్ల పరిధిలోని అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ :** విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని ఆరిలోవ సీఐ గోవిందరావు అన్నారు. ఆరిలోవలోని భారతీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఆయన మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని పాడు చేయడంతో పాటు భవిష్యత్తును అంధకారంగా మారుస్తాయని చెప్పారు.

## స్టూడెంట్ కిట్లు పంపిణీ

**భీమునిపట్నం, జూన్ 20 :** విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ అన్నారు. గురువారం ఆమె వార్డులోని పండిట్ నెహ్రూ, మహాత్మాగాంధీ ఫిషర్‌మెన్ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. అలాగే 4వ వార్డులో జేవీ అగ్రహారం, నిడిగట్టు, కొత్తవలస పాఠశాలల్లో టీడీపీ నాయకుడు నరసింగరావు విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు.

**సాగర్‌నగర్/ఎండాడ :** చిన్న రుషికొండ ప్రాథమిక పాఠశాలలో టీడీపీ 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన నేత శాఖరి శ్రీనివాస్ స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు అక్కరబోయిన రాంబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, ఎరుపల్లి లక్ష్మణరావు, దొరబాబు, శివాజీ పాల్గొన్నారు.

## షీలానగర్‌లో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 51వ శాఖ ప్రారంభం



బ్యాంకు నూతన శాఖను ప్రారంభిస్తున్న మానం ఆంజనేయులు

**అక్కిరెడ్డిపాలెం, జూన్ 20:** షీలానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 51వ శాఖను గురువారం మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో సహకార బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. 110వ వసంతంలోకి అడుగుపెడుతున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 51 శాఖలతో ప్రజలకు విశేష సేవలందిస్తూ సుమారు రూ.88 కోట్ల లాభాలతో నడుస్తుండడం అభినందనీయమన్నారు. బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ సహకార రంగంలో తమ బ్యాంకు ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, బ్యాంకు డైరెక్టర్లు ఏజె స్టాలిన్, జేవీ సత్యనారాయణమూర్తి, జి.జనార్దనరావు, రామచంద్రరాజు, రామకృష్ణ, కె.భవానీ, సీఈవో నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ గణేశ్, పాల్గొన్నారు.

## 24 నుంచి విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

**వెంకోజీపాలెం, జూన్ 20 :** జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో ఉన్న విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 24 నుంచి 26 తేదీ వరకు జరగనున్నట్టు నెహ్రూ యువజన సేవా సంఘం సభ్యుడు శంకర్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలిరోజు అమ్మవారికి గణపతి పూజ, 501 బిందెలతో జలాభిషేకం, పుణ్యాహవాచనం పరిషత్, రక్షా సూత్రధారణ, మండపారాధన ఉంటుందన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



దోభీఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వెలగపూడి

**ఎంవీపీ కాలనీ,జూన్ 20 :** ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో రూ. 30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 15 లక్షలతో దోబీఘాట్, రూ. 15 లక్షలతో ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. అంజయ్యనగర్ వాసులకు దోబీఘాట్ అవసరం ఉందని, వారి కోసం త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. కార్పొరేటరు మంగవేణి పోలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, నాయకులు మసేను, రామారావు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

### వెలగపూడికి అభినందనలు

**వెంకోజీపాలెం :** తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును 15వ వార్డుకు చెందిన జేఆర్‌నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం వెలగపూడి క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ కాలనీలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మూర్తి, ఉపాధ్యక్షుడు దేవేంద్రావర్మ, కార్యదర్శి పెరుమాళ్ల రాజు, గంగాధరం, జీఎస్ శివప్రకాష్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ సమావేశం

**పద్మనాభం (రూరల్), జూన్ 20 :** రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించి మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ ఎస్. వెంకటరావు కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం పునస్కరించుకుని సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వ్యవస్థల కంటే రెవెన్యూ కీలకమని, సిబ్బంది క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉప తహసీల్దార్ నియోగి, ఆర్ఐ కోటేశ్వరరావు, సర్వేయర్ లీలా, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి వీల్‌చైర్ వితరణ

**తగరపువలస, జూన్ 20 :** జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేట గ్రామానికి చెందిన ఎరుసు లక్ష్మి అనే దివ్యాంగురాలికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శారద దంపతులు వీల్ చైర్‌ను వితరణగా అందజేశారు. లక్ష్మి నడవలేని స్థితిలో ఉన్న విషయాన్ని గంటా కుటుంబీకులకు స్థానిక నాయకులు తెలియజేయగా వారు వీల్ చైర్‌ను కొనుగోలు చేసి, వితరణగా ఇచ్చారు.

## అప్పన్నకు పసిడి కుసుమార్చన

**సింహాచలం, జూన్ 20 :** వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం పసిడి కుసుమార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున పసిడి సంపెంగలతో స్వామివారికి అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో జరిపి స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## సమస్యలపై వినతి

**సింహాచలం, జూన్ 20 :** జీవీఎంసీ 98వ వార్డు టీవీ టవర్ కాలనీలో వసతుల లేమి వేధిస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ నరసింహం గురువారం ఉదయం కాలనీ పర్యటనకు వెళ్లినప్పుడు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీటి నిల్వలు వల్ల దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందన్నారు. అలాగే కాలనీలోని అనుసంధాన రోడ్లన్నీ పాడయ్యాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. యువత కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

## పల్లాను కలిసిన అక్కరమాని వెంకటరావు

**వెంకోజీపాలెం, జూన్ 20 :** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం నాయకుడు అక్కరమాని వెంకటరావు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు తోటగరువు గ్రామ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి చిన్నారావు, ఈత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అప్పారావు, మన్యాల రమణ, అచ్చి ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

## రామోజీరావుకి ఎంపీ శ్రీభరత్ నివాళి



నివాళి అర్పిస్తున్న ఎంపీ శ్రీభరత్, గండి బాబ్జి

**మద్దిలపాలెం, జూన్ 20 :** తెలుగు పత్రికా రంగంలో విలువలకు నిలువుటద్దంగా నిలిచిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అని ఎంపీ శ్రీభరత్ అన్నారు. శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్లో గురువారం రామోజీ గ్రూపు సంస్థల పూర్వ విద్యార్థులు నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ, రామోజీ గ్రూపు పూర్వ ఉద్యోగి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధన పరిశీలన

**ఎంవీపీ కాలనీ, జూన్ 19 :** పెదజాలారిపేట ప్రభుత్వ మత్స్యకార ప్రాథమిక పాఠశాలను ఎస్‌సీఈఆర్‌టీ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు 90 రోజుల ప్రణాళికలో ఎలాంటి మార్పు వచ్చింది, ఆట పాటల ద్వారా పిల్లలను చదువుకు ఎలా సన్నద్ధం చేస్తున్నారు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భద్రత వంటి అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ శిల మంగోసా, డైట్ అధ్యాపకులు సోమయాజులు, ఎఫ్ఎల్ఎన్ డీఆర్‌పీలు రఘురాముడు, శ్రీను, గంగాధరుడు, సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారిణి లక్ష్మీ, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

**ఆరిలోవ, జూన్ 20 :** ఆరిలోవ రెండవ సెక్టారులోని బాల త్రిపుర సుందరీ సహిత మల్లేశ్వరస్వామి 33వ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి, అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ చీఫ్ ట్రస్టీ ఎం. కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

**పద్మనాభం (రూరల్), జూన్ 20 :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె. స్వప్న సూచించారు. గురువారం ఆమె పాండ్రంగిలో స్థానికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

## అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

**పద్మనాభం (రూరల్), జూన్ 20 :** అనుమతి లేకుండా గ్రావెల్, మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్. వెంకటరావు హెచ్చరించారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. గ్రావెల్, మట్టి అవసరమైన వారు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. పంట పొలాల్లో నుంచి మట్టి తరలించాలన్నా.. రైతులు ముందుగా అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

## విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు హర్షణీయం

**పద్మనాభం (రూరల్), జూన్ 20 :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్య పేరును వైసీపీ సర్కారు తొలగించగా కూటమి ప్రభుత్వం తిరిగి అదే పేరుతో పునరుద్ధరించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు చెందిన 27 పథకాలను తొలగించగా కూటమి విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరును కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు.

## మహిళా సమస్యల పరిష్కారానికి కృషి

**పద్మనాభం, జూన్ 20 :** మహిళా సమస్యల పరిష్కారంపై గ్రామస్థాయిలో ఉన్న జెండర్ కమిటీలు పని చేయాలని వెలుగు ఏరియా కోఆర్డినేటరు సత్యంనాయుడు చెప్పారు. మండలంలోని గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటయిన జెండర్ కమిటీ సభ్యులకు గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస, బాల్య వివాహాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలపై అఘాయిత్యాల నివారణ, పిల్లల అక్రమ రవాణా నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కిశోర బాలికలతో సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు.



## సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఓఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35,టమాటా 60, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 44, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 28, క్యారెట్ 32, దొండకాయలు 38, బంగాళా దుంపలు 31, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 160, బరబటి 66, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | -- 125 |
| ఫారం ధర | -- 145 |
| విత్ స్కిన్ | -- 260 |
| స్కిన్‌లెస్ | -- 270 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..